క్లుప్తంగా

ఎగసిన మంటలు.. తప్పిన ప్రమాదం



తాడేపల్లి రూరల్ : మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు వద్ద ఉన్న హెచ్‌బీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సోమవారం మంటలు చెలరేగాయి. గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ ఎండిపోయిన పిచ్చి మొక్కలకు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన పెట్రోల్ బంక్ సిబ్బంది మంటలు బంక్ వైపు వ్యాపించకుండా పైపుల ద్వారా నీరు చల్లారు. ఎంతకూ మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, ఎగిసిపడుతున్న మంటలను అదుపుచేశారు. సుమారు 2 గంటల సేపు మంటలను అదుపులోకి తెచ్చినట్లు సిబ్బంది తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



ఫిరంగిపురం: వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం ద్వారానే వడ దెబ్బకు గురికాకుండా ఉండొచ్చని వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. 113 త్యాళ్లూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 234 మందికి వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాగర్‌రాణి, ఏఎన్‌ఎం సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా వడ్డెరలు అడుగులు వేయాలి



నెహ్రూనగర్: వడ్డెరలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల వెంకట్ తెలిపారు. అరండల్‌పేటలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30లక్షలకు పైగా ఉన్న వడ్డెరలకు రాజ్యాధికారం సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో రాజకీయ పార్టీల అధ్యక్షుల్ని కలిసి తమ విజ్ఞప్తులను తెలియజేస్తామని తెలిపారు. ఆదివారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన వడ్డెర యువగర్జన సభకు హాజరై జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నిధి చెక్కు అందజేత



పట్నంబజారు: పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించడంతోపాటు, వారి ఆర్థికస్థితిగతుల్ని పరిశీలించి ఇబ్బందికర పరిస్థితుల్లో అందజేసే సీఎంఆర్‌ఎఫ్ ఎంతో విలువైందని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజినల్ కో– ఆర్డినేటర్ కార్యాలయంలో సోమవారం గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెం గ్రామానికి చెందిన సూరిశెట్టి మాణిక్యాలరావుకు మంజూరైన రూ. 1.50 లక్షల సీఆర్‌ఎఫ్ చెక్కును రాజశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొలకలూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

‘సిద్ధం’ అవ్వండి

- మేదరమెట్లలో సీఎం సిద్ధం సభ విజయవంతానికి పిలుపు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త సుచరిత

తాడికొండ: బాపట్ల జిల్లా, మేదరమెట్లలో వచ్చే నెల 3న నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధం మహా సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఆమె మాట్లాడారు. సిద్ధం మహా సభకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు తరలి రావాలని కోరారు. ఇప్పటికే నిర్వహించిన మూడు సిద్ధం మహాసభలు విజయవంతం అయ్యాయని, అంతకంటే దీటుగా 4వ సభకు ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల నుంచి భారీగా ప్రజలు తరలిరానున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే ఇందుకు కారణమన్నారు. ప్రజలందరూ తరలివచ్చి..మహా సభను విజయవంతం చేయాలని కోరారు.

మానవ మనుగడకు నీటి వనరులు ఎంతో కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: మానవ మనుగడకు నీటి వనరులు ఎంతో కీలకమని ఏఎన్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డి.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం–1 ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన వెంగళాయపాలెంలో ఏర్పాటు చేసిన వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా మంగళవారం నీటి పొదుపు, నీటి వనరుల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సకల జీవకోటి మనుగడకు ఆహారం ఎంత అవసరమో, నీరు అంతే అవసరమన్నారు. నీటి వనరుల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లోనూ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని, వర్షాకాలంలో వాన నీటిని అందులోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాల్ని పెంపొందించాలని సూచించారు. భావితరాలకు మనం ఇచ్చే ఆస్తి మంచినీరే అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి ఎం. గిరిజ, లక్ష్మీదీప్తి, సంధ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.



వెంగళాయపాలెంలో విద్యార్థినులతో రవిశంకర్ రెడ్డి, అధ్యాపకులు

లక్ష్మీనరసింహపురంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం సందర్శన

హిందూ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ లక్ష్మీనరసింహపురంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాన్ని సోమవారం ఏఎన్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగ సమన్వయకర్త డి.రవిశంకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సేవా కార్యక్రమాలను పరిశీలించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పి.వి. రాము, విద్యార్థి సమన్వయకర్త సుకాంత్, నీరజ్, తనుశ్రీ , వాత్సల్య, అనిత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఐసీఏఐ గుంటూరు శాఖ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కార్యవర్గంతో గీత, ప్రసన్నకుమార్, ముప్పాళ్ల శ్రీధర్, సుబ్బారావు, దయానివాస్‌శర్మ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్ఐఆర్‌సీ చైర్‌పర్సన్ ఏబీ గీత, ఐసీఏఐ కేంద్ర కమిటీ సభ్యులు డి. ప్రసన్నకుమార్, ముప్పాళ్ల శ్రీధర్, దయానివాస్ శర్మ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ 2024–25లో ఐసీఏఐ గుంటూరు శాఖకు నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని చెప్పారు. రానున్న సంవత్సరానికి సమగ్ర కార్యాచరణ రూపొందించుకుని గుంటూరు బ్రాంచ్‌ను జాతీయస్థాయిలో ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్‌సీ కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు, ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ, వైస్ చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్, కోశాధికారి వనిమిరెడ్డి వెంకట నరేష్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, కమిటీ సభ్యులు వంగల భార్గవి, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

గుల్జార్ కవిత్వం వైవిధ్యం, కళాత్మకం

లక్ష్మీపురం: కవిగా, రచయితగా గుల్జార్ భిన్న సాహిత్య ప్రక్రియల్లో కృషి చేశారని, ఆయనకు జ్ఞాన్‌పీఠ్ అవార్డు రావడం ముదావహమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మనమూ పాడుదాం.. రండి! కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, గాయకులు, కవులు పాల్గొన్నారు. ప్రముఖ గాయకులు రత్నాజీ మాట్లాడుతూ చిత్రసీమలో గుల్జార్ ఆవిష్కరించిన సాహిత్యం ఎంతో విశాలమైంది, విలక్షణమైందని తెలిపారు. ఆయన కవితల నిండా మనిషి, మనస్సు, ప్రకృతి, మానవత్వం కనిపిస్తాయన్నారు. ప్రముఖ రచయిత బి.వి.రమాకుమార్ మాట్లాడుతూ గుల్జార్ రచనలు ఇంగ్లిష్, పంజాబీ, బెంగాలీ, బ్రిజ్, మరాఠి భాషల్లో విశేష ఆదరణ పొందాయని తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు బి.అశోక్, గాయకులు భరత్‌రెడ్డి, సాయిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అవగాహన సంస్థ సభ్యులు

నేడు సిల్వర్ జూబ్లీ బ్లాక్‌కు భూమిపూజ

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి రాక

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ ఫార్మసీ కళాశాల స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ భవన నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిపూజకు త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ఆధునిక సదుపాయాలతో డిజిటల్ లైబ్రరీతో పాటు కంప్యూటర్ ల్యాబ్, పరిశోధన, ప్రయోగశాలల్ని ఏర్పాటు చేసి, జాతీయస్థాయిలో ఉత్తమ ఫార్మసీ కళాశాలగా అభివృద్ధి పరచనున్నట్లు వివరించారు. సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య పాల్గొన్నారు.



ఈవీఎంల పరిశీలన

ఫిరంగిపురం: రేపూడి మార్కెట్ యార్డు గోడౌనులోని ఈవీఎంలను ఆర్డీవో శ్రీకర్ సోమవారం పరిశీలించారు. సెక్యూరిటీ సిబ్బంది రిజిస్టర్, సీసీ కెమెరాల పనితీరును గురించి సిబ్బందిని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరా, ఇన్వర్టర్ పనితీరు పరిశీలించారు. ఆయన వెంట డీటీ రాజారమేష్, వీఆర్వో శివకోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత

ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి 1986–87 పదో తరగతికి పూర్వవిద్యార్థులు షేక్.నూర్ అహ్మద్, వై. అంజనాదేవి బీరువాను అందజేసినట్లు హెచ్‌ఎం ఇమ్మానియేల్ సోమవారం తెలిపారు. పాఠశాలలో పూర్వవిద్యార్థులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ డి.నాగిరెడ్డి, సర్పంచ్ జి.నాగమల్లేశ్వరీ అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని రేవేంద్రపాడు, సీతానగరం బకింగ్‌హామ్ కెనాల్ కరకట్ట వెంబడి మెల్లెంపూడి వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. మెల్లెంపూడికి చెందిన కుర్రే శ్రీనివాస్‌రెడ్డి, ఈదులమూడి ప్రసాదరావు (56) ద్విచక్ర వాహనంపై రేవేంద్రపాడు వెళ్లి వస్తుండగా అదుపు తప్పి కిందపడ్డారు. ఈ నెల 22న జరిగిన ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి చేర్పించారు. చికిత్స పొందుతూ ఈదులమూడి ప్రసాదరావు మృతి చెందాడు.

గుంటూరు జీజీహెచ్ ఏఓగా ప్రతాప్ కుమార్



గుంటూరు మెడికల్: జీజీహెచ్ పరిపాలనా అధికారిగా (ఏఓ) దేవరపల్లి ప్రతాప్‌కుమార్‌ను నియమిస్తూ సోమవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆఫీస్ సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించి ఏఓలుగా పదోన్నతి కల్పించారు. ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిలో 1991లో కారుణ్య నియామకం ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన ప్రతాప్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్‌గా 1994లో ప్రమోషన్ పొంది నెల్లూరు దొరవారి సత్రానికి బదిలీ అయ్యారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా 2017లో ప్రమోషన్ పొంది నెల్లూరు ఏసీఎస్‌ఆర్ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వచ్చిన ఆయనకు సోమవారం ఏఓగా పదోన్నతి లభించి గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. కాగా గుంటూరు జీజీహెచ్ ఏఓగా పని చేస్తున్న పూసల శ్రీనివాసరావు రెండు నెలల కిందట అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. నాటి నుంచి ఏఓ పోస్టు ఖాళీగా ఉంది. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఏఓగా నల్లపాడు రీజనల్ ట్రెనింగ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీకుమారి నియమితులయ్యారు.

కన్నెగంటి హనుమంతుకు ఘన నివాళి



గుంటూరు మెడికల్: స్వాతంత్ర్య సమర యోధుడు కన్నెగంటి హనుమంతు సేవలు ఎంతో విలువైనవని అహల్య ట్రస్టు నిర్వాహకులు, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. కన్నెగంటి హనుమంతు వర్ధంతి సందర్భంగా సోమవారం చుట్టుగుంట సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

రోటరీ క్లబ్ ఆఫ్ త్రివేండ్రం సౌత్ రొటేరియన్ బీపీ బిజు

తాడేపల్లిరూరల్ : బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రోటరీ క్లబ్ ఆఫ్ త్రివేండ్రం సౌత్ రొటేరియన్ బీపీ బిజు అన్నారు. సోమవారం వడ్డేశ్వరం కృష్ణవేణి ఎగ్జిబిషన్ సొసైటీ పాలిటెక్నిక్ కాలేజీలో విద్య ద్వారా బాలికల సాధికారత అనే అంశంపై రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు పరుచూరి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి బిజు మాట్లాడుతూ కేవలం ఉద్యోగాల కోసం చదవడం కాకుండా టాలెంట్‌ను వెలికి తీయాలన్నారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు, బుక్స్, స్టేషనరీ అందజేశామని తెలిపారు. సుమారు 15 లక్షల మంది బాలికలకు అవగాహన కల్పించేందుకు 800 రోజుల్లో భారతదేశ వ్యాప్తంగా బైక్‌పై పర్యటిస్తున్న బిజును అభినందించారు. ఆమె పర్యటన 57వ రోజుకు చేరుకుందని, ఇప్పటికే 9వేల మంది విద్యార్థులను కలసి, వారికి అవగాహన కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చంద్ర ఓబులారెడ్డి, ప్రాజెక్ట్ చైర్మన్ గొల్లవల్లి శ్రీలత, సభ్యులు రావూరి రమేష్‌బాబు, శంకర్‌శెట్టి రమేష్, ఆరిగకూటి రవీంద్రారెడ్డి, తెనాలి అసిస్టెంట్ గవర్నర్ మురళీకృష్ణ, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బిజుతో రోటరీ క్లబ్ సభ్యులు

నదుల పవిత్రతను కాపాడుకోవాలి

డాక్టర్ హబీబుల్లా ఖాన్

తాడేపల్లిరూరల్ : నదుల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేఎల్‌యూ విద్యార్థి విభాగపు సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ప్రాతూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణానది పవిత్రతను, స్వచ్ఛతను కాపాడుకోవాలన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని తొలగించినట్లు చెప్పారు. కృష్ణానది నీరు ఎన్నో లక్షల హెక్టార్ల పంట పొలాలను సస్యశ్యామలం చేస్తోందని, ఎన్నో వేల గ్రామాలకు తాగునీరు అందిస్తుందన్నారు. అటువంటి పవిత్రమైన నది నీటిని కలుషితం చేయడం సమంజసం కాదన్నారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి, సమన్వయ కర్తలు పి. సురేష్, జి. చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏసుదాసును వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సుమన్ అభినందించారు.



కృష్ణానదిలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించిన వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మానవాళి రక్షణకు మొక్కల పెంపకం అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: భూమిపై మనుషులతో పాటు సకల జీవజాతులు మనుగడ సాగించేందుకు పచ్చని వృక్షాలు ఎంతో కీలకమని గుంటూరు జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి జె.వి. సుధీర్‌కుమార్ తెలిపారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం–2 ఆధ్వర్యంలో జోసఫ్‌నగర్‌లో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం మండల పరిషత్ పాఠశాలతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు నాటిన మొక్కలు రాబోయే రోజుల్లో వృక్షాలుగా ఎదిగి, సమస్త జీవకోటికి ప్రాణవాయువును ప్రసాదిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగ అధికారిణి డి.ధాత్రికుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద విద్యార్థినులతో సుధీర్‌కుమార్, ధాత్రికుమారి

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

పట్నంబజారు: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆటో బోల్తాపడిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కెట్ నుంచి గుజ్జనగుండ్ల వెళుతున్న ఆటో ఎస్పీ కార్యాలయం దాటి కొంత దూరం వెళ్లిన తరువాత కంకరగుంట ఫ్లైఓవర్ దిగి పోస్టాఫీసు వద్ద యు టర్న్ తీసుకుంటున్న ఝాన్సీ అనే మహిళను ఢీకొంది. ఈ క్రమంలో ఆటో బోల్తా పడింది. ఆటోడ్రైవర్ కోటేశ్వరరావు అతివేగంగా వెళుతూ ప్రమాదానికి కారణమయ్యాడని పోలీసులు తెలిపారు. గాయాలపాలైన మహిళ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఎస్పీ కార్యాలయం సమీపంలో బోల్తాపడిన ఆటో

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతమ్మ కాలనీకి చెందిన తిరుమలకొండ వినోద్ (29) వ్యక్తిగత కారణాలతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మరొకరు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన ఆవుల సాయివిజయ్ (31) అప్పుల బాధ భరించలేక ఈనెల 20న పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24న మృతి చెందాడు. బంధువులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

పెదకాకాని: ఢిల్లీలో రైతుల సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం కొనసాగుతుందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్రాపు సూర్యనారాయణ స్పష్టం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపుమేరకు సోమవారం పెదకాకానిలో రైతు, కార్మిక , ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్య సంస్థతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం జాతీయ రహదారులపై దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఒప్పందాల వల్ల దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరుగుతాయని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమానికి అందరూ మద్దతు తెలపాలని కోరారు. మద్దతు ధరలు చట్టం చేస్తానని, రైతుకు రెట్టింపు ఆదాయం చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ దీనికి భిన్నంగా పార్లమెంటులో దొడ్డిదారిన 175 చట్టాలు చేసి వ్యవసాయం, పరిశ్రమల్ని దెబ్బతీసే విధంగా చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పెదకాకాని సెంటర్ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా నాయకులు కంచుమాటి అజయ్, నళినీకాంత్, హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, దానబోయిన భాస్కరరావు, దండా లక్ష్మీనారాయణ, ఈమని అప్పారావు, కూరపాటి కోటయ్య, ఎం.అరుణ్ కుమార్, కాకుమాను నాగేశ్వరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మంచాల(చేబ్రోలు): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం మంచాలలో సోమవారం జరిగింది. పొన్నూరు పట్టణానికి చెందిన పి. గోపీచంద్ ద్విచక్ర వాహనంపై చేబ్రోలు వైపు వస్తున్నారు. మార్గంమధ్యలో మంచాల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ప్రమాదవశాత్తూ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గోపీచంద్ తలకు, కాళ్లు, చేతులకు గాయాలైనాయి. 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుష్పోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఎంజీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదిక క్రతువు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా ఖండం ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి శిష్య బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, నిఖిల్ శాండిల్యా దంపతులు, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, గుంటి వెంకట్ దంపతులు, మూర్తి వెంకటేశ్వరరావు దంపతులు, జంధ్య రామారావు దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, సంకీర్తన సేవా సమితి అధ్యక్షులు కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మవద్దు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పురపాలక సంఘం సరఫరా చేసే రక్షిత మంచినీరు కలుషితమైందని పలువురు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని చెంచుపేట, అమరావతి ప్లాట్స్ ఏరియాలో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని డీ అండ్ వో ట్రేడ్ లైసెన్స్‌లు వ్యాపారులు వెంటనే రెన్యువల్ చేయించుకోవాలన్నారు. అలా చేయించుకోని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం, ఏకాగ్రత



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం పెంపొందడంతో పాటు ఏకాగ్రత, సమష్టిగా కృషి చేసే అలవాటు అలవడతాయని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాల క్రీడా మైదానంలో హిందూ పీజీ, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంసీఏ విద్యార్థులకు మూడురోజుల పాటు నిర్వహించిన ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ పి. రవి, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ కె. లలిత, అడ్మిన్ డైరెక్టర్ డి. కల్యాణి, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ సీహెచ్. వైష్ణవి, సహాయాచార్యులు వేదవతి, బాజీబాబు, అభిలాష్, గోపి శ్రీనివాసరావు, మణికంత, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com